## పోచుకోలు రాయుడు



"జగన్నాథం మోటారుసైకిల్ బేరం చేస్తున్నావట. బేరం కుదిరిందా ?"

"బేరం అయితే కుదిరింది; కాని నీవు మధ్యవర్తిగా వుంటే యిస్తానంటున్నాడు."

"ఏం అట్లా ?"

"ఏం లేదు. డబ్బు వచ్చేనెలలో యిస్తానన్నాను."

"వచ్చేనెలలో తప్పకుండా యివ్వగలవా అని ?"

"ఓ యస్. నేను కట్టబోయే లాటరీ డ్రా తేదీ ఈ నెలాఖరుకే గదా !"

ఈ శీర్షిక క్రింద పాఠకులు జోక్సు పంపితే వేస్తాము.



# హనుమాయమ్మ

బంగారమ్మ కొడుకుతో, "శేఖరం, హనుమాయత్త వాళ్ల అన్నకొడుకు పెళ్లికి అమలాపురం వెడుతోందిరా" అన్నది.

'నువ్వుకూడా వెడదామనా అమ్మా ?'

'అబ్బే. ఆమధ్య కామరాజుగారు నీకోస మని చెప్పిన పెళ్ళిసంబంధం అమలాపురందే గనక ఆపిల్లని కాస్త చూసిరమ్మందా మనుకుంటున్నాను.'

'చూసిరావాలంటే మనమే వెళ్లాలి. పైవాళ్లని పంపకూడ దని నాఉద్దేశం.'

'హనుమాయత్తంటే స్వయానా నీ మేనమామ భార్య. పైది ఎలా ఔతుందిరా ? ఆ ఊరు ఎలాగా వెడుతోందిగనక పనిలోపని ఆ పిల్లని చూసి సంగతి సందర్భాలు చెపుతుంది. ఆ మీద మనకు నచ్చుతుందనితోస్తే నువ్వు వెళ్లి చూసుకురావచ్చు. వాళ్లుతప్ప మన కింక మగదక్షు తెవరూ ?'

'హనుమాయత్తే మనకి మగదక్షుతంటావ్ ?' అన్నాడు శేఖరం కొంటెగా.

'ఒరేయ్, నీతో నేను మాట్లాడలేనురా !'

'నువ్వు చెప్పినదే రైటమ్మా ! హనుమాయత్త నిజంగా పదిమంది మగవాళ్ల పెట్టు !'

అడుగుల చప్పుడై వాళ్లిద్దరూ గుమ్మంవైపు చూశారు. హనుమాయమ్మ ప్రత్యక్షమయేసరికి ఇద్దరూ నోరు మెదపలేదు.

'ఏమిటి బంగారమ్మొదినా, నన్ను చూడ్డంతోనే గప్‌చిప్పుగా ఊరుకున్నారు ?'

'అత్తకి వెయ్యేళ్లాయుష్షు !' అన్నాడు శేఖరం.

'ఎందుకు నాయనా అంత ఆయుర్దాయం ?' అంది హనుమాయమ్మ.

'నీమాటే అనుకుంటున్నాం వదినా. పెళ్ళికి వెడుతున్నావుకదూ ?'

'నువ్వు రావా అదైతే? మా అన్నయ్య ఒక్కగాని ఒక్క కొడుకు పెళ్లికి తర్లి వెడుతోంటే మీరు రారూ?'

పాలంకి వెంకట రామచంద్రమూర్తి

'రావలసిందే అనుకో.... దానికేం గాని మా కో ఉపకారం చేసిపెట్టాలి వదినా నువ్వు.'

'ఏమిటి ?'

'నువ్వు వెడుతోన్న ఊళ్లోనే ఒక పెళ్లి కూతు రుందిట.'

'ఎవరికి? మీ శేఖరానికా? అయితే మీవాడు మా చెల్లెలి కూతుర్ని చేసుకోడన్నమాటేనా ?'

శేఖరం నవ్వుతో, 'అత్తా, చేసుకుంటే నీ కూతుర్ని చేసుకోవాలిగాని మీచెల్లెలి కూతుర్ని చేసుకోడమేమిటి?' అన్నాడు.

'చూశావా మీవాడు నాకు ఆడపిల్లలు పుట్టలేదని ఆక్షేపిస్తున్నాడు !'

'నీ కేమమ్మా వరుసగా మగమాణిక్యాలనే కన్నావు !'

శేఖరం నవ్వుతో, 'ఆ మగమాణిక్యాల తరువాత ఇంక వరసని ఆడముత్యాలనే కంటుంది! వెయ్యేళ్ళ ఆయుర్దాయంలో నా కోసం ఒక్క ఆడపిల్లనైనా కనకపోతుందా ఏమిటిలే!' అన్నాడు.

'అప్పటికి నువ్వు ముసిలివాడివై పోతావు! మా పిల్లకి ముసిలిమొగుణ్ణి చేస్తా ననుకున్నావా ?'

'అయితే మీచెల్లెలి పిల్లకి మాత్రం నేను పెద్దవాణ్ణి కానూ? దానికేం గాని అత్తా! ఆపిల్లకి అడుగులెయ్యడం వచ్చిందా?' అన్నాడు శేఖరం.

'చూశావుటమ్మా నీ కొడుకు వెటకారం?'

'వాడి వెటకారానికేం గాని నా మాట కడ్డొచ్చావు. ఆ అమలాపురంలో కూచిమంచివారి అగ్రహారం అని ఉందిట. తాసిల్దారు టాయన. వారి రెండో అమ్మాయిని చూచిరావాలి నువ్వు'.

'ఊరికి ముందు మనమే వాళ్లింటికి వెడితే లోకు వైపోముటమ్మా?'

'హనుమాయత్త అప్పుడే మగపెళ్లివారి హక్కులు అమలు పరుచుకుంటూంది!'

'కాకపోతే నీకుమల్లే ముందే అత్తవారితో ఏకమై పొమ్మంటావా?'

'వాడితో ఏమిటి పోనిద్దూ ? చూసి వస్తావుకదూ ?' అంది బంగారమ్మ.

'అలాగే. కూచిపూడి అగ్రహారంలో తాసిల్దా రనికదూ అన్నావు ?'

'కూచిమంచివారి అగ్రహారం'

'చెంకాయ పిచ్చికొండ చేసేటట్లుంది అత్తయ్యా! కూచిమంచివారి అగ్రహారంలో పెళ్ళికూతుర్ని చూసి రమ్మంటే కూచిపూడి వెళ్లి భాగవతం చూసి వచ్చేట ట్లుంది!' అన్నాడు శేఖరం.

హనుమాయమ్మ చిరుకోపంతో, 'చూశావుటమ్మా?' అంది.

'వాడి మాటలకేం లెద్దూ. నాకీ ఉపకారం చేసిపెట్టు.'



'అలాగేలే. వెడతామరి.' అంటూ హనుమాయమ్మ చక్కాపోయింది.

'ఏదో పనిమీద వచ్చి చెప్పకుండానే పోతోందే!' అనుకుంది బంగారమ్మ.

'పెళ్లికి ఏ కాసులపేరో ఎరువు తీసుకు వెళ్లటానికి వచ్చింది. నేను లేకుండా చూసి మళ్లీ వస్తుందిలే!' అన్నాడు శేఖరం.

## 2

హనుమాయమ్మ భర్త వెంకట్రామయ్యగారు ట్రంకుపెట్టె పట్టించుకుని బస్సుస్టాండువైపు నడుస్తోంటే హారను వినిపించింది.

'బస్సు కదులుతోంది! కాస్త చురుగ్గా అడుగులు వేస్తావేమో అనుకుంటే పెళ్లినడకలు ఇక్కడే మొదలెట్టేవు!'

రోజుకుంటో వస్తోన్న హనుమాయమ్మకి వళ్లు మండి, "ఇక్కడ నా మీద ఎగిసిపడకపోతే, వెళ్ళి ఆ బస్సువాడితో 'ఆగవోయ్', అంటే ఎంత బాగుండును?" అని కోప్పడి, హెచ్చు కంఠంతో "ఆపవోయ్, అబ్బి; కొంచెం ఆపు" అన్నది.

నిజానికి ఆహారను, డ్రైవరు కోసం ఎవరో వేసినది. హనుమాయమ్మ బస్సులో ప్రవేశిస్తో, 'బస్సు కదిలిపోతోందని కంగారు పెట్టేశారు! ఆ డ్రైవరు రావటానికి అరగంటైనా పట్టకపోతే నా చెవిని కోసిస్తాను!' అన్నది.



"మేము మిషన్‌మన్‌కి 50 రూపాయలు మాత్రమే యిస్తామని ప్రకటించాం, నీవు 100 రూపాయలు అడుగుతున్నావు, ఆ మిషన్‌మీద నీ కెంత సర్వీ సుంది?"

"లేదుసార్, అసలు నా కా పని తెలియదు. తెలియని పని చేయటం కష్టం చూడండి. అందుకు 50 రూపాయలు ఎక్కువ అడిగాను."

---

'నీ చెవి ఎవరి క్కావాలిలే. కాస్త ఆ మూల సర్దుక్కూచో' అన్నాడు వెంకట్రామయ్యగారు.

ఆవిడ పరికించి చూసేసరికి వెనక సీటులో ఇరవైయేళ్ల వా డొహడు కూర్చుని కనపడ్డాడు.

'ఏమోయ్ అబ్బాయ్, ఇలాగ ఆడవాళ్లపక్కని మగవాళ్లు కూచుంటే ఎలాగ ? ఆ అమ్మాయి పక్కనుంచి లేచి కాస్త అలాగ ముందుకు వెళ్లు.'

ఆతడు, 'ఈమె నా భార్యాయేనండీ' అన్నాడు.

'నేను కాదన్నానుటోయ్ ? నువ్వు

మగవాళ్లలోకి వెళ్లి కూచుంటే మీ ఆవిడపక్కన నేనుకాస్త కూచుంటాను.'

వెంకట్రామయ్యగారు భార్యతో, 'అతణ్ణి లేవమనడ మెందుకు పోనిస్తూ? ఆ సీటుపక్కన మూటమీద కూర్చో రాదూ?' అన్నాడు.

ఆవిడ చిరాగ్గా, 'మూటమీద కూచుంటే అందులో సరుకులు పాడై పోవుటండీ? ఆడవాళ్ల పక్కని ఆడవాళ్లు కూచుంటా మనటంలో తప్పేముంది? మీ మూలానకాని అతగాడు లేచేవాడే!' అన్నది.

'నేను లేచినా ఈ చోటు కాస్తా మీకు చాలదండీ!'

'నేను లావుగా ఉన్నాననా నాయనా ఆక్షేపిస్తున్నావ్?'

'ఆక్షేపించడం కాదండి. బస్సు ఓవరులోడయింది. కండక్ట రొచ్చి దిగమంటాడు.'

'కండక్ట రొస్తే నే చెబుతాగా. నన్ను కూచోనియ్యి....నన్ను ఇలాగ నిలబెట్టడం బాగుండలేదని నువ్వేనా చెప్పమ్మాయ్ మీ ఆయనతో.'

అతగాడు ప్రాణం విసిగి లేచాడు. కసిగా 'కూచోండి....కొంచెం మెల్లిగా కూచోండి!' అన్నాడు.

హనుమాయమ్మ నవ్వుతో, 'ఏం నాయనా? నా మూలాన సీటు విరిగి పోయి మీ ఆవిడకి దెబ్బ తగుల్తుందేమో అనా? ఫరవాలేదులే......... కాస్త జరు గమ్మాయ్!'

'ఇంకెక్కడికి జరగ మంటారు?' అంది ఆ అమ్మాయి విసుగ్గా.

'ఎక్కడికక్కడే పేచీపెడితే ఎలా గమ్మాయ్? మేం మాత్రం టిక్కట్టు ఇవ్వటంలేదూ? కాస్త సరిగా కూచో నియ్యి!'

'లొట్టిపిట్ట కథలాఉంది మీ సంగతి! కాస్త తలదాచుకోనియ్య మంటూ వచ్చి అంతా ఆక్రమించుకుందిట! రెండుసీట్లూ మీరే ఆక్రమించుకుంటా నంటే ఎలాగ? రెండు టిక్కట్లు చింపించబోతున్నారా?'

హనుమాయమ్మ కోపంతో, 'ఏం? నీకుమల్లే ఏసిలాగ లేననా ఆక్షేపిస్తున్నావు?' అంది.

'కాస్త సర్దుక్కూచుంటే తీరిపోయే దానికి ఎందుకే అలాగ కీచులాడతావ్?' అన్నాడు వెంకట్రామయ్య.

ఆమె నల్లేరుమీద బండిలాగ, "మీరూరుకోండి! మగవాళ్లన్న పేరే గాని కాస్త చోటు చేయించలేక పోయారు మళ్లీని! నే నేదో తంటాలు పడుతోంటే 'తగుదు నమ్మా' అంటూ మాట్టాడొచ్చారు" అంటూ దులిపేసింది.

అంతలో బస్సు కండక్ట రొచ్చి, "ఒకరు ఎక్కువగా ఎక్కేరు. ఎవరో, దిగండి" అన్నాడు.

'ఆఖర్ని ఎక్కుత ఈవిడే. నేను చెపుతోనే ఉన్నాను. వినిపించుకుంది కాదు, అన్నాడా అబ్బాయ్ కసిగా.



'దిగండమ్మా' అంటూ గదిమేడు కండక్టరు.

'అర్జంటుగా పెళ్లికి వెడుతోంటే మమ్మల్ని దిగమంటావేమిటోయ్? ఆ నిలపడ్డవాళ్లని దిగమను!' అంది హనుమాయమ్మ.

నిలబడ్డవాళ్లలో ఉన్న ఆ యిరవై యేళ్ల యువకుడు 'మీకు చోటిచ్చినందుకా నన్ను దిగిపొమ్మంటున్నారు? బాగానే ఉంది!' అన్నాడు.

వెంకట్రామయ్యగారు కండక్టరుతో 'బాబూ, నీకు పుణ్య ముంటుంది. ఇందులో వెళ్లకపోతే లగ్నం వేళకి అందుకోలేం. ఇదుగో టిక్కట్లకి డబ్బు' అంటూ తీసి ఇచ్చాడు.

'అదేమిటండీ, కుర్రనాగమ్మ క్కూడా కొంటున్నారు?' అన్నది హనుమాయమ్మ.

'మూడేళ్లుదాటితే టిక్కట్టు కొనాలమ్మా' అన్నాడు కండక్టరు.

'అదేమిటోయ్ ఎక్కడ వినలేదు! కాస్తగోవగా ఉన్నాడుకదా అని వాడిక్కూడా పుచ్చుకుంటావా?'

'పదేళ్లకు తక్కువ ఉండ వీ అబ్బాయికి!'

'దెయ్యపు కంటికి పేలాపగింజ పెద్దదిగా కనపడుతుంది. వీడికా పదేళ్లు?'

'మర్యాదగా మాట్లాడ వమ్మా కాస్త!'

వెంకట్రామయ్యగారు వ్యవహారం శ్రుతిమించకుండా కలుగజేసుకుని 'నోరుమూసుకుని ఊరుకోవేకాస్సేపు!' అన్నారు స్వతంత్రించి. ఆమె ఊరుకోలేదు. 'మీయిష్టంవచ్చినట్టు డబ్బంతా తగలెయ్యండైతే' అనేసింది.

'ఏమండోయ్, దయచేసి నా చీర మీదనుంచి మీకాలు కొంచెం తీస్తారా?' అంది పక్కనున్న అమ్మాయి.

'బస్సులో కూచున్నప్పుడు చీర నలిగిపోతోందంటే ఎలాగే తల్లీ? .... ఔనుగాని ఈ చీర ఎంతకి కొన్నావమ్మా?'

'పదిహేను రూపాయ లంటే మీకు నచ్చిందా చీర?'

'నచ్చిందికాని పదిహేను రూపాయలంటే ఎక్కువే!'

'ఎంత ఇవ్వచ్చుంటా రమైతే?'

'ఆమధ్య బేరమాడితే కొట్టువాడు పదకొండుకే యిస్తా నన్నాడు.'

'పదకొండుకే కొన్నారా ఐతే?'

'లేదు.'

'అలాగ చెప్పండి! మీది కొనని బేర మని తెలుసుండే వాడు పదకొండుకే యిస్తానన్నాడు!.... కాస్త అటు జరుగుతారా?'

## 3

పెళ్లిలో ఆడపడుచు లకన్నా ఎక్కువ హంగామా చేసింది హనుమాయమ్మ. 'ఎవర్రా ఆ మహాతల్లి?

అలా వేపుకు తింటోంది?' అన్నా రంతా.

'కూచిమంచివారి అగ్రహారంలో తాసిల్దారుగా రింటికి వెళ్లాలి. ఒక బండి తెప్పించండి,' అని ఆజ్ఞాపించింది కన్యాదాతతో. ఆవిడ బైటకు వెడితే కాస్సేపైనా పెళ్ళి పందిరి శాంతంగా ఉంటుం దన్న ఆలోచనతో వెంటనే బండి ఎక్కించి పంపేశా డాయన.

'ఈ పిల్లయేనా పెళ్లికూతురు?' అంది హనుమాయమ్మ తాసిల్దారుగారి భార్య జానకమ్మతో.

'అప్పుడే పెళ్లికూతురేమిటిలెండి? ఇంకా పెళ్లిమాట తలపెట్టటంలేదు.'

'ఈడు రాలేదనా మీ రనేది? పెళ్లిచేసుకుంటే ఈ పాటికి ఇద్దరు బిడ్డలతల్లి అయేది!'

జానకమ్మ నవ్వుతో, 'మీకు చాలా చిన్నతనంలోనే ఐందనుకుంటాను!' అన్నది.

హనుమాయమ్మ గొప్పగా, "నాకు నాలుగేళ్లూ, మా వారికి ఎనిమిదీని! ఇంకా తలంబ్రాలు పోస్తా నంటూ ఏడ్చానుట పెళ్ళిలో!" అన్నది.

జానకమ్మ కుమార్తె నవ్వుతో, 'ఐతే మళ్లీ పోయించారా అండీ తలంబ్రాలు?' అని అడిగింది.


'మళ్లీ కూచోపెట్టి పోయించడానికి తీరి కెవరికే అమ్మా పెళ్ళిలో?.........ఔనుగాని నీ పేరేమిటో చెప్పావే కాదు.'

"మీరు అడగందే చెప్పడందేనికి అని ఊరుకున్నాను."

'అబ్బో! గడుసు గడుగ్గాయి వేఐతే!....అడిగేనుగా,చెప్పు.'

'శతపత్రసుందరి'

'నాజూకుగా రెండక్ష రాల పేరుండాలి గాని





పెద్దాపురం చాంతాడుకుమల్లే ఇంతపొడు గేమిటి? మీ అమ్మమ్మ పేరా, నాయనమ్మ పేరా ఇది?'

"'అమ్మలగన్న యమ్మ ముగురమ్మల మూలపుటమ్మ' యైనటువంటి ఆ ఆదిలక్ష్మి పేరండీ."

'అబ్బో, చాలా చదివేవే! ఏ క్లాసు చదువుతున్నావేమిటి?'

'సిక్సు ఫామ్'

'సిత్తు పార మంటే మెట్రిక్లేషన్ కన్నా పైదేనా?... ఏమైనా ఆడపిల్లల చదువులకి ఆట్టే డబ్బుపోసి లాభం లేదండీ, జానకమ్మా గారూ. ఏమంటారా, రాజమండ్రీలో మా పక్కింటివారి కోడలు బియ్యేస్సు పాసై ఇప్పుడు పప్పు రుబ్బుకుంటోంది!'

శతపత్ర సుందరి నవ్వుతో, 'బియ్యేస్సు కాదండీ. బి.ఎస్‌సీ.... ఒక పని చెయ్యరాదూ మీరు?.... అన్నట్లు అడగటం మరిచిపోయాను. మీ పే రేమిటండీ?' అంది.


"నా పేరా? 'హనుమాయమ్మ'"

'బలేపేరు హనుమాయమ్మగారూ!'

"నన్ను నువ్వు 'పిన్ని' అని పిలవాలే తల్లీ."

"Why? ఎందుచేత?"

'నీ పెళ్లికొడుకు శేఖరం నాకు



స్వయానా మేనల్లుడు. నువ్వు కూతురు వౌతావన్న మాట.'

'డామ్‌యూ అండ్ యువర్ పెళ్ళి కొడుకూ!'

జానకమ్మ కంగారుగా, 'అమ్మాయ్!' అని మందలించింది.

'ఏమిటీఅంటోంది ఇంగిలిపీసులో?' అంది హనుమాయమ్మ.

"'మీ పెళ్ళికుమారుడుగారుకూడా మీకుమల్లేనే అందంగా ఉంటారా?' అంటున్నా నండీ !"

హనుమాయమ్మ కోపంగా, 'నన్ను, లావుగా ఉన్నా ననా ఆక్షేపిస్తు న్నావ్?' అంది.

'నో, నో, పప్పు రుబ్బడం బాగా అలవాటై జబ్బపుష్టి సంపాదించి మాంచి వస్తాదులా గున్నారు! అది లావు ఎలాగవుతుంది? నేనుచెప్పవచ్చిన దేమిటంటే మీరు మీ పక్కింటి వారి కోడలికి ఒక ఉపకారం చేసి ఆమెవల్ల మీరు ప్రత్యుపకారం పొందవచ్చు.'

'ఏమిటి?'

ఆ అమ్మాయికి మీరు పప్పు రుబ్బి పెట్టండి. రుబ్బుతున్నంతసేపూ ఆ అమ్మాయిని ఏ కథైనా చదివి మీకు వినిపించ మనండి.'

జానకమ్మ మళ్లీ, 'అమ్మాయ్!' అని మందలించింది.

హనుమాయమ్మ కోపంగా, 'పెళ్లి కొడుకు మేనత్త నన్న గౌరవంలేకుండా మాటాడుతోంది మీ పిల్ల!' అంది.

'సారీ, మీరు పెళ్లిచూపులకు వచ్చా రన్న మాటే మరిచిపోయా నండీ! నా సంగీతం పరీక్ష చేస్తారా, ఒక్క పాట పాడతాను!' అంటూ ఆమె సమాధానానికి ఆగకుండానే 'కడవంతా గుమ్మడీ, కత్తిపీటకూ లొక్కూ....' అంటూ పాడటం ప్రారంభించిం దా దుడుకుపిల్ల.

"చూశా రా నన్ను 'గుమ్మడి కాయ!' అంటోంది. బాగా నే తయారు చేశారు అమ్మాయిని!" అన్నది హనుమాయమ్మ.

'పసిపిల్లమాట పట్టించుకోకండి.'

'పదహారేళ్ళు నెత్తిమీద కొచ్చి పసి పిల్లేమిటమ్మా యింకా?'

జానకమ్మ వచ్చే కోపాన్ని ఆపు కుంటూ, 'కాఫీ పుచ్చుకోండి, చల్లారి పోతోంది' అంది.

'కతుకుతే అతక దేమో?' అంది శతపత్రసుందరి కొంటెగా.

కాని హనుమాయమ్మకు ఆ మాట సంతోషమే కలిగించింది! 'ఇంగ్లీషు చదువుకున్నా మీ పిల్లకి మన సాంప్ర దాయాలు తెలుసన్నమాట! నాకు నీమీద వచ్చిన కోప మంతా దీంతో పోయిందే సుందరీ.'

'థ్యాంక్సు మైడియర్ పంప్‌కిన్!'



"రాత్రికొన్న చీరె మోసం జరిగిందండీ, పగలుకొన్నా బాగుండేది.''
"ఆఁ, పగలైనా అంతకంటే ఎక్కువే జరుగుతుంది; నేను నిన్ను చూట్టానికి పెళ్ళి చూపుల కొచ్చింది పగలేగా!''

'మీ పిల్లని తప్పకుండా సిఫారసు చేస్తానండీ మా మేనల్లుడికి!........ఏదీ ఒక్కమాటు లేచి నడు అమ్మాయ్.'

జానకమ్మ నిర్ఘాంతపోయింది. 'ఎందుకూ? ఏ కాలు వంకరైనా ఉందేమో చూద్దా మనా?'

'ఔనండీ. ఏమంటే తర్వాత మా ఆడబడుచు తిట్టిపొయ్యకుండా ముందే జాగ్రత్తగా పరీక్షించడం మంచిది.'

దానితో జానకమ్మకు వళ్ళు మండింది. 'మంచి మర్యాదస్తులే మీరు! మావా రొచ్చే వేళైంది. వారికి ఈ సంగతి తెలుస్తే కోప్పడతారు. మీరు ఇంక వెళ్ళండి!'

'అతక దని తేలింది గనక ఆ కాఫీని కతికి వెళ్ళండి! ఊరికే పోనివ్వడ మెందుకు?' అన్నదా దుడుకుపిల్ల.

'ఇంటికి వచ్చినదాన్ని కావా లని అవమానం చేశారు! ఇంక నా బొందెలో ప్రాణ మున్నంతవరకూ మీ సంబంధాన్ని కానివ్వను!'

'తథాస్తు! వెళ్ళండి మరి.'

జానకమ్మ తలుపు వేస్తో, 'వాళ్లెవరో చూసిరమ్మని పంపుతే యీవిడ కాల్చుకుపోతోంది!' అన్నది.

'అందుకే ఈవిడకు హనుమాయమ్మ పేరు సరిగ్గా సరిపోయిం దంటాను.'

'బాగా చెప్పేవు!'